క్లుప్తంగా

ఘనంగా పైడితల్లి చండీయాగం



చండీయాగం నిర్వహిస్తున్న వేదపండితులు

విజయనగరం టౌన్: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడితల్లి అమ్మవారి చండీయాగం వనంగుడిలో వేదపండితుల వేదమంత్రోచ్చారణల నడుమ సోమవారం ఘనంగా నిర్వహించారు. వేద పండితులు వెలువలపల్లి నరసింహమూర్తి, సాయిలు శాస్త్రోక్తంగా యాగాన్ని నిర్వహించి, చండీమాత యాగ విశిష్టతను భక్తులకు వివరించారు. అనంతరం యాగంలో పాల్గొన్న భక్తులకు అమ్మవారి శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

మెరుగైన పారిశుధ్యానికి కృషి

- కార్పొరేషన్ ప్రజారోగ్యాధికారి కొండపల్లి సాంబమూర్తి



విజయనగరం: ప్రజా సహకారంతో నగరంలో సంపూర్ణ పారిశుధ్యానికి కృషి చేస్తానని విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ ప్రజారోగ్య అధికారి కొండపల్లి సాంబమూర్తి అన్నారు. ప్రజారోగ్య అధికారిగా సోమవారం బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, కాలానుగుణ వ్యాధుల నియంత్రణకు చర్యలు చేపడతామన్నారు. వర్షాకాలంలో దోమల నివారణకు అవసరమైన చర్యలు తీసుకుంటానని తెలిపారు. మెరకముడిదాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి తాను బదిలీపై వచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో పారిశుధ్య పర్యవేక్షకులు బాలకృష్ణ, సాల్మన్‌రాజు, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ వెంకట్ పాల్గొన్నారు.

విధులతోనే గుర్తింపు



గంగరాజును సన్మానిస్తున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: పోలీస్‌శాఖలో బాధ్యతాయుతమైన విధులు నిర్వహిస్తే తప్పనిసరిగా గుర్తింపు లభిస్తుందని ఎస్పీ ఎం. దీపిక అన్నారు. సోమవారం పదవీవిరమణ చేసిన హోంగార్డ్ సామిరెడ్డి గంగరాజును స్థానిక పోలీస్ కార్యాలయంలో సత్కరించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ ఎల్.శేషాద్రి, ఆర్ఐ ఎస్.గోపాలనాయుడు, డీపీఓ పర్యవేక్షకుడు ప్రభాకరరావు, ఆర్ఎస్సై శ్రీనివాసరావు, హోంగార్డ్ హెచ్‌సీలు రాజు, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



కేవీ రమణ

డెంకాడ: మండల విద్యాశాఖాధికారి–1గా కేవీ రమణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. రణస్థలం మండలంలో విద్యాశాఖాధికారిగా పని చేసి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా రమణకు పలువురు ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు.

ఎంఈఓ –1గా రాజ్‌కుమార్

పూసపాటిరేగ: మండల విద్యాశాఖ కార్యాలయంలో ఎంఈఓ–1 గా అల్లక రాజ్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రుల సహకారంతో విద్యాభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

నైపుణ్య విలువలపై శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న సెంచూరియన్ వీసీ మహంతి

నెల్లిమర్ల రూరల్: మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో ఆరు లక్షల మందికి విడతల వారీగా నైపుణ్య విలువలపై శిక్షణ ఇచ్చినట్లు వీసీ మహంతి తెలిపారు. సోమవారం ఆయన మూడో విడత నైపుణ్య విలువలపై శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఎంతో మంది యువతకు ఉపాధి శిక్షణ ఇచ్చి వారి కాళ్లపై వారు నిలబడేలా తీర్చిదిద్దామన్నారు. నైపుణ్య శిక్షణను నిరుద్యోగులు సద్వినియోగపరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ పల్లవి, డీన్ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

నేటి నుంచి 'జగనన్న సురక్ష'

నెల్లిమర్ల రూరల్: నగర పంచాయతీలో మంగళవారం నుంచి జగనన్న సురక్ష ప్రత్యేక క్యాంపులు నిర్వహించనున్నట్లు కమిషనర్ బాలాజీ ప్రసాద్ సోమవారం ఒక ప్రకటలో తెలిపారు. 4న జరాజాపుపేట–1 సచివాలయం, 6న మొయిద జంక్షన్–1, 11న అగురు వీధి, 13న ఇందిరా కాలనీ, 15న పద్మశాలి వీధి, 18న గాంధీ నగర్ కాలనీ, 20న మొయిద జంక్షన్–2, 22న జరజాపుపేట–2 సచివాలయాల్లో జగనన్న సురక్ష క్యాంపులు కొనసాగుతాయని పేర్కొన్నారు.

దొంగే.. దొంగ అన్నట్లుంది..

- టీడీపీ నాయకుల తీరు సరికాదు
- రెండు నెలల్లో అంబటిసత్రం – కొత్తపేట రహదారి పనులు
- వారు చేయలేక చేతులెత్తేసినవే.. మేము పూర్తి చేస్తున్నాం
- నగరంలో మౌలిక సదుపాయాల కల్పన మా హయాంలోనే..
- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



అంబటిసత్రం పరిసర ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, సంబంధిత ప్రజాప్రతినిధులు, అధికారులు

విజయనగరం: దొంగే.. దొంగ, దొంగ అని అరిచిన చందాన ప్రతిపక్ష టీడీపీ నాయకుల తీరు ఉందని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఎద్దేవా చేశారు. జిల్లా కేంద్రమైన విజయనగరంలో మౌలిక సదుపాయాల కల్పనకు చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని స్పష్టం చేశారు. టీడీపీ హయాంలో చేయలేక, చేతులెత్తేసిన పనులను సైతం.. అభ్యంతరాలను పరిష్కరిస్తూ, అడ్డంకులను అధిగమిస్తూ తాము పూర్తి చేస్తున్నామన్నారు. పలు కారణాలతో కొన్నేళ్లుగా అసంపూర్తిగా మిగిలిపోయిన అంబటి సత్రం కూడలి నుంచి కొత్తపేట నీళ్ల ట్యాంక్ రహదారిని ఆయన సోమవారం స్వయంగా పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, నగరంలో మౌలిక సదుపాయాల కల్పన తమ హయాంలోనే జరిగిందన్నారు. కొన్ని దశాబ్దాలుగా వేసవి కాలంలో నీటి సమస్య ఉండేదని.. తాము తీసుకున్న చర్యల వల్ల నాలుగేళ్లుగా నీటి సమస్య ఉత్పన్నం కాలేదని చెప్పారు. అలాగే డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచి, మారుమూల ప్రాంతాలకు సైతం రహదారులు వేయిస్తున్నామని తెలిపారు. కంటోన్మెంట్ – బాలాజీ కాంప్లెక్స్ మీదుగా కలెక్టరేట్ వరకు.. మయూరి కూడలి – బాలాజీ జంక్షన్, ఆర్‌అండ్‌బీ కూడలి – పాల్‌నగర్, బాలాజీ జంక్షన్ – గంటస్తంభం, తదితర చోట్ల రోడ్లు వేస్తున్నామన్నారు. ఇప్పటికే కొన్నిచోట్ల పనులు పూర్తికాగా.. మరికొన్ని చోట్ల త్వరలోనే పూర్తి చేస్తామని తెలిపారు. ప్రధానంగా అంబటి సత్రం – కొత్తపేట నీళ్ల ట్యాంక్ వరకు రహదారి పెండింగ్‌లో ఉందని, మరికొద్ది రోజుల్లో ఆ రహదారి సైతం పూర్తి చేస్తామన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి వెళుతున్న సమయంలో సమస్యలు గుర్తించి, పరిష్కరిస్తున్నట్లు చెప్పారు.

వారు చేయలేని పనులను మేము చేస్తే తప్పా?

టీడీపీ నాయకులు చేయలేని పనులను తాము పూర్తి చేస్తున్నామని, అందుకే ఓర్వలేకే దుష్ప్రచారానికి దిగుతున్నారని కోలగట్ల అన్నారు. తమ పాలన ప్రజలకు నచ్చింది కాబట్టే కార్పొరేషన్ పరిధిలో 49 మంది డివిజన్‌లలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించారని గుర్తు చేశారు. తమ పాలన పట్ల ప్రజలు పూర్తి విశ్వాసంతో ఉన్నారని తెలిపారు. ప్రతిపక్షాలకు మరోదారి లేక.. ప్రజల పేరిట రోడ్డెక్కుతున్నాయని విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు, లేనప్పుడు మాజీ మంత్రి అశోక్ ఏనాడూ బాధ్యతగా వ్యవహరించలేదని.. ఆయన ప్రజల్లోకి వచ్చారంటే ఎన్నికలు సమీపించినట్లేనని ఎద్దేవా చేశారు. అంబటి సత్రం రహదారి పూర్తయితే నగరంలోని ప్రధాన మార్గాల పనులన్నీ పూర్తి చేసినట్లేనని కోలగట్ల స్పష్టం చేశారు. కార్యక్రమంలో నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ ముచ్చు లయాయాదవ్, ఫ్లోర్ లీడర్ ఎస్వీవీ రాజేష్, జోనల్ ఇన్‌చార్జ్‌లు ముచ్చు శ్రీనుయాదవ్, ముద్దాడ మధు, అల్లు చాణక్య, గుజ్జల నారాయణరావు, పలువురు కార్పొరేటర్లు, ఆర్‌అండ్‌బీ అధికారులు, కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమం

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
- నగరంలోని 48వ డివిజన్‌లో 'గడప గడపకు మన ప్రభుత్వం'



లబ్ధిదారులతో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, నగర మేయర్, తదితరులు

విజయనగరం: అర్హత ఉండి ప్రభుత్వ పథకాలు పొందలేని వారి వివరాలను తెలుసుకొని తక్షణమే సంక్షేమ కార్యక్రమాలు అందించడమే ధ్యేయంగా పని చేస్తున్నామని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న సురక్ష కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్తున్న వలంటీర్లు రాజకీయాలకు అతీతంగా లబ్ధిదారుల వివరాలు సేకరిస్తున్నారన్నారు. నగరంలోని 48వ డివిజన్ 59వ నంబర్ సచివాలయ పరిధిలో సోమవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు, అధికారులు, సిబ్బందితో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల అమలు తీరును, స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అన్ని సంక్షేమ పథకాల నగదు నేరుగా బ్యాంక్ ఖాతాలకు జమవుతున్నాయని స్థానికులు చెప్పడంతో ఆ ప్రాంతమంతా హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. అనంతరం మేయర్ వెంపడాపు విజయలక్ష్మి మాట్లాడుతూ, ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో ప్రజారంజక పాలన సాగుతోందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల ముంగిటికే చేరువ కావడంతో ప్రజలలో ఆనందం వ్యక్తం అవుతుందని చెప్పారు. అర్హత ఉండి ధ్రువపత్రాలు పొందలేని వారికోసం ప్రత్యేకంగా జగనన్న సురక్ష పథకం అమలు చేయడం గొప్ప విషయమన్నారు. సచివాలయ కన్వీనర్ తేజ మాట్లాడుతూ, సచివాలయ వ్యవస్థ ద్వారా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ముచ్చు లయాయాదవ్, అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, స్థానిక కార్పొరేటర్ నడిపల్లి ఆదినారాయణ, కంటుభుక్త తవిటిరాజు, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన విశ్వవిద్యాలయంలో 'గురు వందనం'



సత్కారం పొందుతున్న యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కట్టిమణి

విజయనగరం అర్బన్: కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయంలో సోమవారం గురు వందన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అఖిల భారత రాష్ట్రీయ శైక్షిక్ మహా సంఘ జాయింట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ గుంట లక్ష్మణ్ మాట్లాడుతూ, గురువుకు భగవంతుడి హోదాను కల్పించిన దేశం మనదేనన్నారు. ఏబీఆర్‌ఎస్‌ఎం సీటీయూ ఏపీ యూనిట్ నిర్వహించిన ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ టీవీ కట్టిమణి మాట్లాడుతూ, ఉపాధ్యాయ వృత్తి ఉదాత్తమైనదని, ఈ వృత్తికి గౌరవం తీసుకురావడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. 2022 యూపీఎస్ సివిల్స్‌లో 200 ర్యాంక్ సాధించిన గిరిజన విశ్వవిద్యాలయంలోని డాక్టర్ అంబేడ్కర్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫ్యాకల్టీ మహేశ్ కాంతంని ఈ సందర్భంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏబీఆర్‌ఎస్‌ఎం సీటీయూ ఏపీ యూనిట్ అధ్యక్షురాలు డాక్టర్ పి.శ్రీదేవి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బంద్‌కు సహకరించండి

- ఏబీవీపీ నాయకులు



ఏబీవీపీ ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఏబీవీపీ నాయకులు

విజయనగరం: ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని నియంత్రించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 5న చేపట్టనున్న పాఠశాలల బంద్‌ను విజయవంతం చేయాలని ఏబీవీపీ రాష్ట్ర నాయకుడు రాజాన రమణ కోరారు. సోమవారం స్థానిక అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ కార్యాలయంలో బంద్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ.. నారాయణ, చైతన్య లాంటి విద్యా సంస్థలతో పాటు పలు ప్రైవేట్ పాఠశాలలు విద్యను వ్యాపారంగా మార్చడం దురదృష్టకరమన్నారు. పాఠశాలల్లో పుస్తకాలు, యూనిఫామ్‌ల అమ్మకాలను అరికట్టాలన్నారు. టెక్నో ,ఈ టెక్నో , స్మార్ట్ ఒలింపియాడ్, ఇంటర్నేషనల్ లాంటి బ్రాండ్ల పేరుతో జరుగుతున్న ఫీజుల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ ద్వారా ఖాళీగా ఉన్న 30 వేలకు పైగా టీచర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ వంశీకుమార్, సాయి, గౌరీనాయుడు పాల్గొన్నారు.

క్రీస్తు సువార్తను విశ్వవ్యాప్తం చేయాలి



నిరుపేదలకు ఆహార పొట్లాలను అందజేస్తున్న పీటీసీ ప్రిన్సిపాల్ ఆనందబాబు

విజయనగరం టౌన్: క్రీస్తు సువార్తను విశ్వవ్యాప్తం చేయాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని ఆల్ ఇండియా క్రిస్టియన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పి.ప్రేమానందం అన్నారు. పట్టణ పాస్టర్స్ ఐక్యవేదిక ఆధ్వర్యంలో సోమవారం ఇండియన్ క్రిస్టియన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎం.ఐజక్, బిషప్ ఎం.పాల్సన్, రెవరెండ్ డి.ఎలీషా, డాక్టర్ పాల్ శ్రీనివాస్, వివేక్, జాన్ మోజెస్, ఎస్.మధు, స్టీఫెన్ పాల్, తదితరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం పీటీసీ ప్రిన్సిపాల్ ఆనందబాబు చేతుల మీదుగా పట్టణంలో ఉన్న అనాథలు, యాచకులకు ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యబ్బోజు చౌదరి, మధుసూదన్, సైమన్ సుధీర్, ప్రసాద్, నికోదమస్, సునీల్, ఆనంద్, జయవంత్ బాబు, కరుణకుమార్, తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్ రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడిగా కట్టమూర్తి

విజయనగరం టౌన్: ఇటీవల ద్వారకా తిరుమలలో జరిగిన సీనియర్ సిటిజన్ రాష్ట్ర అసోసియేషన్ ఎన్నికల్లో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా డాక్టర్ కట్టమూరి, కార్యదర్శులుగా సుంకరి సూర్యనారాయణ, జగన్నాథరావు ఎంపికైనట్లు జిల్లా సీనియర్ సిటిజన్ అసోసియేషన్ ప్రతినిధులు మంగళవారం ఒక ప్రకటన తెలిపారు. రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా టీవీ సత్యనారాయణ ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం స్థానికంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్ర కమిటీకి ఎంపికైన వారిని జిల్లా అసోసియేషన్ ప్రతినిధులు అభినందించారు.

ఫిజియోథెరపీతో మంచి ఫలితాలు



ఫిజియోథెరపీని పరిశీలిస్తున్న ఎంఈఓ కేవీ రమణ

డెంకాడ: మండల భవిత కేంద్రంలో విభిన్న ప్రతిభావంతులైన పిల్లలకు ప్రతివారం నిర్వహిస్తున్న ఫిజియోథెరపీతో మంచి ఫలితాలు సాధించవచ్చని మండల విద్యాశాఖాధికారి–1 కేవీ రమణ అన్నారు. భవిత కేంద్రంలో సోమవారం నిర్వహించిన ఫిజియోథెరపీ క్యాంప్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, చిన్నారులకు శిబిరానికి క్రమం తప్పకుండా తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఫిజియోథెరపిస్ట్ బి.హిమబిందు, ఐఈఆర్‌పీ కె.అప్పలరాజు పాల్గొన్నారు.

మొలకలు వచ్చినట్టైతేనే విక్రయించాలి

డెంకాడ: వరి విత్తనాలు విక్రయించే వ్యాపారులు ముందుకు మొలకకట్టి 85 శాతం మొలకలు వచ్చినట్టైతేనే విక్రయించాలని వ్యవసాయశాఖ ఏడీఏ ఎల్. విజయ అన్నారు. మండలంలోని డెంకాడలో ఉన్న కృష్ణ రైతుమిత్ర గ్రూపు, గంగామాంబ ఫెర్టిలైజర్స్ ఎరువులు, విత్తనాల దుకాణాలను సోమవారం తనిఖీ చేశారు. డెంకాడ గంగమాంబ ఫెర్టిలైజర్స్ దుకాణంలో నిబంధనలు పాటించకపోవడంతో రూ.4.40 లక్షల విలువ చేసే వరి విత్తనాల అమ్మకాలను నిలిపివేశారు. ఈ సందర్భంగా ఏడీఏ విజయ మాట్లాడుతూ, వరి విత్తనాలు అమ్మేటప్పుడు నిబంధనలు పాటించాలన్నారు. రైతులకు విధిగా రశీదులు ఇవ్వాలని స్పష్టం చేశారు. అలాగే దుకాణాల వద్ద స్టాక్‌బోర్డు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఓ పి.నిర్మల, ఏఎస్ దామోదరరావు, తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా సేవా కార్యక్రమాలు



క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న సభ్యులు

విజయనగరం: రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేయనున్నట్లు రోటరీ క్లబ్ విజయనగరం సెంట్రల్ అధ్యక్ష, కార్యదర్శులు వీవీ రాజేష్, అరుణ్ సోధాని అన్నారు. రోటరీ అర్బన్ హెల్త్‌సెంటర్‌లో సోమవారం ఏర్పాటు చేసిన క్లబ్ సమావేశంలో వారు మాట్లాడుతూ, క్లబ్ నూతన కార్యవర్గం బాధ్యతల స్వీకరణ కార్యక్రమం మంగళవారం సాయంత్రం చేపడుతున్న నేపథ్యంలో ఉదయం పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్న పేర్కొన్నారు. ముందుగా అయ్యన్నపేట శివాలయంలో మొక్కలు నాటడం, రోటరీ అర్బన్ హెల్త్‌సెంటర్‌లో రక్తదాన శిబిరం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సాయంత్రం ఆరు గంటలకు నగరంలోని హోటల్ ఎస్వీఎన్ లేక్ ప్యాలేస్‌లో క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో క్లబ్ చైర్మన్ ఎం.శ్రీనివాస్, క్లబ్ ట్రైనర్ పి.జయకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

వేద సంస్కృతిని పరిరక్షించాలి

- వాగ్దేవి సమారాధన సంస్థ వ్యవస్థాపకురాలు డాక్టర్ పి. స్వప్నహైందవి



కార్యక్రమంలో మాట్లాడుతున్న పెన్నేటి స్వప్న హైందవి

విజయనగరం టౌన్: వేద సంస్కృతిని పరిరక్షించుకోవాలని వాగ్దేవి సమారాధనం (జై పైడిమాంబ వేద సంస్కృతాంధ్ర సాంప్రదాయ పరిరక్షణ సేవా సంఘం) వ్యవస్థాపకురాలు డాక్టర్ పెన్నేటి స్వప్నహైందవి అన్నారు. వ్యాస పూర్ణిమ సందర్భంగా వ్యాసుని చిత్రపటంతో కోట జంక్షన్ నుంచి పైడితల్లి అమ్మవారి ఆలయం వరకు సోమవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం అమ్మవారికి విశిష్ట పూజలు చేశారు.

గురువులకు, సామాజిక సేవకులకు సత్కారం

ఈ సందర్భంగా అమ్మవారి కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో అతిథులుగా హాజరైన ఎస్వీఎన్ శివజ్యోతి గ్రూప్స్ డైరెక్టర్ జ్యోతి, అర్చక సేవా సమితి ఉపాధ్యక్షుడు వెలువలపల్లి ఉమా మహేశ్వరరావు, సామాజికవేత్త పల్లంట్ల వెంకట రామారావు (పీవీఆర్), ఎంఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. సూర్యకాంతి, పలువురు వేదంపండితులను ఘనంగా సత్కరించారు.

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి



విజయనగరం: యోగా గురువు సుందర శివరావును సత్కరిస్తున్న దృశ్యం.



విజయనగరం టౌన్: నారాయణ పబ్లిక్ స్కూల్‌లో గురువుల ఆశీస్సులు అందుకుంటున్న విద్యార్థులు



పూసపాటిరేగ: షిర్డీసాయి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



పూసపాటిరేగ: నక్కానపేటలో షిర్డిసాయిని దర్శించుకుంటున్న భక్తులు



పూసపాటిరేగ: షిర్డీ సాయి మహాస్తూపాన్ని దర్శించుకుంటున్న భక్తులు



నెల్లిమర్ల: గురుపౌర్ణమి సందర్భంగా రామతీర్థం ఉమా సదాశివుడ్ని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే బడ్డుకొండ దంపతులు



విజయనగరం: రింగ్‌రోడ్డులో గల షిర్డీ సాయిబాబా ఆలయంలో బాబాను దర్శించుకుంటున్న భక్తులు



నెల్లిమర్ల రూరల్: జ్ఞానానంద ఆశ్రమంలో ఆధ్యాత్మిక గురువులను సన్మానిస్తున్న రామారావు, తదితరులు

గురుపౌర్ణమి వేడుకలు సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. సాయిబాబా ఆలయాలు, మందిరాలు భక్తులతో కిటకిటలాడాయి. ఈ సందర్భంగా వేకువ జాము నుంచే సాయిబాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే వివిధ రంగాల్లో రాణిస్తున్న గురువులను సత్కరించారు. రెడ్‌క్రాస్ యోగా శిక్షణ కేంద్రంలో యోగా గురువు అరి సుందర శివరావును సన్మానించారు. పూసపాటిరేగ మండల కేంద్రంతో పాటు నక్కానపేటలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. నక్కానపేటలో 144 అడుగుల సాయి స్తూపంలో సాయికోటి పుస్తకాలు వేసి ప్రత్యేక పూజలు చేశారు. రామతీర్థం ఉమా సదాశివుడి దేవాలయంలో ఎమ్మెల్యే బడ్డుకొండ దంపతులు గురుపౌర్ణమి సందర్భంగా పూజలు చేశారు. నెల్లిమర్ల నగర పంచాయతీ జరజాపుపేట జ్ఞానానంద ఆశ్రమంలో ఆధ్యాత్మిక గురువులను సత్కరించారు.

– విజయనగరం/నెల్లిమర్ల నెట్‌వర్క్

ప్రత్యేక ఓటర్ల నమోదుకు సహకరించాలి



పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న ఈఆర్వో సూర్యనారాయణ

విజయనగరం రూరల్: ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమానికి రాజకీయ పార్టీలు సహకరించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కేఆర్‌ఆర్‌సీ తహసీల్దార్ డాక్టర్ ఆర్‌వీ సూర్యనారాయణ కోరారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఓటర్ల జాబితా సవరణలు, పోలింగ్ కేంద్రాల మార్పు, ముసాయిదా జాబితా ఓటర్ల ప్రకటన, ఫారం 6, ఫారం 6ఏ, ఫారం 7, ఫారం 8లపై అవగాహన కల్పించారు. సమావేశంలో ఎన్నికల డీటీ బోని సంజీవ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నుంచి విజయనగరం ఎంపీపీ అప్పలనాయుడు, ఎస్వీవీ రాజేష్, టీడీపీ నుంచి రవిశంకర్, కాంగ్రెస్ నుంచి సతీష్‌కుమార్, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.